క్లుప్తంగా

వర్షంతో నేలకొరిగిన వరి



కుంటాలలో నేలవాలిన వరి

కుంటాల: తుఫాన్ ప్రభావంతో మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున వర్షం కురిసింది. దీంతో వరి పంటలు నెలకొరిగాయి. కల్లాల వద్ద ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ నేతల వాగ్వాదం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ఎస్సీవాడలో బీజేపీ శ్రేణులు గట్టుచప్పుడు కాకుండా బుధవారం ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న లోకేశ్వరం ఎస్సై సాయికుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. గొడవకు దిగిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులను సముదాయించి ఇంటికి పంపించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

ఓటరు చీటీలు పంపిణీ



రాజురాలో చీటీ అందిస్తున్న బీఎల్‌వో

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం బీఎల్‌వోలు ఓటరు చీటీలను పంపిణీ చేశారు. బీఎల్‌వోలు చివరిరోజు దివ్యాంగులకు చీటీలు అందించారు. అర్హులు ఓటును సద్వి ని యోగం చేసుకోవాలని అవగాహన కల్పించా రు.

అయ్యప్ప మహా పడిపూజ



మెట్లకు దీపాలు వెలిగిస్తున్న గురుస్వామి

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో బుధవారం నారికేళ గురుస్వామి గురిజాల నర్సయ్య ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. గణపతి, గౌరీపూజ చేశారు. గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప చిత్రపటాలను అలంకరించి పంచామృతాలతో అభిషేకించారు. గురుస్వామి మంత్రి సాయినాథ్, జక్కని గజేందర్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు చేపట్టారు. గురుస్వాములు కడార్ల హరిప్రసాద్, సిర్కార్ రాజేశ్వర్, నటరాజ్, రజనీకాంత్‌రావు, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



పొట్టపెల్లి(కే)లో సిద్ధమైన పోలింగ్ కేంద్రం

లక్ష్మణచాంద: మండలంలో 31 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 23,558 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అన్ని కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేలా ర్యాంపులు ఏర్పాటు చేసి వీల్‌చైర్లు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

ఖానాపూర్ నియోజకవర్గంలో 305 కేంద్రాలు

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గంలో ఖానాపూర్ రిటర్నింగ్ అధికారి జీవాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని కేబీ ప్రాంగణంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రాంగణంలో సామగ్రిని సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఒకొక్క పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవో, పోలింగ్ అధికారి, పోలింగేతర సిబ్బంది మొత్తం ఐదుగురు ఉంటారు. ఆయారూట్లలో ప్రత్యేకంగా సెక్టార్ అధికారులను నియమించారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో దాదాపు 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు.

ఇంద్రవెల్లి మండలంలో..

ఇంద్రవెల్లి: అధికారులు, పోలీస్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 48 పోలింగ్‌బూత్‌లను కేంద్రాలు ఏర్పాటు చేయగా.. నాలుగు రూట్‌లుగా విభజించి, సిబ్బందిని నియమించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం..

- ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరుకున్న అధికారులు, సిబ్బంది
- ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- ముధోల్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించిన కలెక్టర్



కాటన్‌యార్డులోని పోలింగ్ కేంద్రంలో ఇరుకు గదిని పరిశీలిస్తున్న అధికారులు

భైంసాటౌన్: పట్టణంలోని ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది బుధవారం సాయంత్రం ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. పట్టణంలో 41పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పలు కేంద్రాల్లో గదులు ఇరుకుగా ఉండడంతో విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. స్థానిక కాటన్ యార్డులోని 114,116 పోలింగ్ కేంద్రాలు ఇరుకుగా ఉండడంతోపాటు ఓటర్లు లోనికి, బయటికి వెళ్లేందుకు ఒకే మార్గం ఉందని అక్కడే ఉన్న మున్సిపల్ డీఈఈ దృష్టికి తెచ్చారు. మరుగుదొడ్డి వసతి సైతం సక్రమంగా లేదని వాపోయారు. అలాగే కిసాన్‌గల్లి జెడ్పీ బాలికల పాఠశాలలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో సైతం మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు. దీంతో మున్సిపల్ సిబ్బంది అప్పటికప్పుడు తాత్కాలిక విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేశారు.



ముధోల్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ముధోల్ నియోజకవర్గంలో 311 కేంద్రాలు..

ముధోల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ముధోల్‌లోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద విధుల్లో పాల్గొనే అధికారులకు సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆశిస్‌సాంగ్వీ పరిశీలించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 311 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా నాలుగు వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్లు ఆర్‌వో తెలిపారు. మొత్తం ఓటర్లు 2,49,554 ఉండగా పురుషులు 1,21,731 మంది, 1,27,780 మహిళలు, ఇతరులు ఉన్నారు. ముధోల్‌లో 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 9 ఎస్‌ఎస్‌టీ బృందాలు, 9 ఎఫ్‌ఎస్‌టీ బృందాలు, 7 ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 374 మంది పీవో/ఏపీవోలు, 748 మంది ఇతర సిబ్బంది, 31 సెక్టర్లు, 51 రూట్‌లు, 800 మంది సిబ్బంది ఉన్నట్లు ఆర్‌వో వివరించారు.

కడెం: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు ఏఈఆర్వో రాజేశ్వరి పేర్కొన్నారు. మండలంలో మొత్తం 36 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఇందులో అంబారిపేట్ సమస్యాత్మక కేంద్రం, మరో ఏడు నక్సల్స్ ప్రభావిత కేంద్రాలున్నాయి. మొత్తం 28,276 ఓట్లరు ఉన్నట్లు తెలిపారు. దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏడీఈ శ్రీనివాస్ అన్నారు. రాత్రి అంతరాయం కల్గితే చర్యలు తీసుకునేందుకు కడెం, దస్తురాబాద్ మండలాలకు బ్రేక్‌డౌన్ బ్రేక్ వాహనం ఏర్పాటు చేసినట్లు వివరించారు.



కడెం: మాసాయిపేట్‌లో ఏడీఈ శ్రీనివాస్, సిబ్బంది



కుంటాలకు చేరిన సిబ్బంది

కుంటాల: ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల సహాయ అధికారి ఎజాజ్ అహ్మద్‌ఖాన్, సెక్టోరియల్ అధికారి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల పరిధిలోని 29 పోలింగ్ కేంద్రాలు ఉండగా మూడు రూట్లుగా విభజించి, ముగ్గురు సెక్టోరియల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

ఖానాపూర్: మండలంలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు బుధవారం రాత్రి ఈవీఎంలు, వీవీప్యాట్‌లతో ప్రత్యేక వాహనాల్లో చేరుకున్నారు. మండలంలోని నాలుగు రూట్లలో ఏర్పాట్లను నలుగురు సెక్టార్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని మండల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ పరిమల్ బౌమిక్, సూపర్‌వైజర్, ఎంపీడీవో మల్లేశ్ తెలిపారు. పట్టణంలో 17, గ్రామాల్లో ఉన్న 33 పోలింగ్ కేంద్రాల్లో 40,821 మంది ఓటర్లు ఉన్నారు.



ఖానాపూర్‌లో 232వ కేంద్రం వద్ద అధికారులు

సోన్: మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నట్లు ఎన్నికల సెక్టోరియల్ అధికారి శేఖర్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రూట్ అధికారి అశోక్ కుమార్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



సోన్: న్యూబొప్పారంలో ఎన్నికల సిబ్బంది

లోకేశ్వరం: ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు మండల ఎన్నికల సెక్టోరియల్ అధికారి సోలమాన్ రాజ్ అన్నారు. బుధవారం మండలంలోని రాజూర, లోకేశ్వరం, కిష్టాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో కరెంట్, మరుగుదొడ్డి, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓటర్లకు ఇబ్బందులు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.



లోకేశ్వరంలో సిబ్బందికి సూచనలిస్తున్న అధికారి

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రం పోలింగ్ నిర్వహణ అధికారులు సామగ్రితో చేరుకున్నారు. సిబ్బందికి ఏర్పాటు చేసిన వాహనాల్లో విధులు నిర్వహించే గ్రామాలకు వెళ్లారు.

బరిలో వీరే.. భవిత తేలేది నేడే..

- మూడుచోట్ల.. మొత్తం 38మంది
- నిర్మల్‌లో 13, ముధోల్‌లో 14..
- ఖానాపూర్‌లో 11మంది అభ్యర్థులు
- జిల్లాలో 14మంది స్వతంత్రులు

నిర్మల్: 'అధ్యక్షా.. మా నియోజకవర్గ సమస్యలివి.. మాకు కావాల్సిన అభివృద్ధి ఇది..' అని అసెంబ్లీలో అడుగుపెట్టి అడిగేందుకు మొత్తం 38 మంది పోటీ పడుతున్నారు. శాసనసభ్యులయ్యేందుకు హోరాహోరీగా తలపడుతున్నారు. అలాంటి అభ్యర్థుల్లో ఎవరిని అసెంబ్లీకి పంపించాలో తేల్చే పోలింగ్ డే రానేవచ్చింది. జిల్లాలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మూడు ప్రధాన పార్టీల నుంచి పోటాపోటీగా అభ్యర్థులు ఉన్నారు. వీరితో పాటు వివిధ జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలు పోటీలో ఉన్నాయి. పార్టీలకు ఏమాత్రం తగ్గేది లేదన్నట్లుగా 14 మంది స్వతంత్రులూ బరిలో ఉన్నారు.

నిర్మల్‌లో 13మంది..

అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి(బీఆర్‌ఎస్), ఏలేటి మహేశ్వర్‌రెడ్డి(బీజేపీ), కూచాడి శ్రీహరిరావు(కాంగ్రెస్), డి.జగన్‌మోహన్(బీఎస్పీ), గొర్రెలింగన్న(బీఎంపీ), పరికిపండ్ల స్వదేశ్(ఏఐఎఫ్‌బీ), మంతెన ఇంద్రకరణ్‌రెడ్డి(ఏడీఆర్‌పీ), రవీందర్ రామగిరి(డీఎస్పీ)

స్వతంత్రులు : ఖాజా నయిమొద్దీన్ మహ్మద్, దేవొళ్ల రాజు, బుర్క రాజేందర్, మల్లేశ్ మద్దికుంట, సుదర్శన్ చవాన్

ముధోల్‌లో 14మంది..

గడ్డిగారి విఠల్‌రెడ్డి(బీఆర్‌ఎస్), పవార్ రామారావు పటేల్(బీజేపీ), భోస్లే నారాయణరావుపటేల్(కాంగ్రెస్), వినోద్‌కుమార్ సర్దార్(బీఎస్పీ), కాసారం రాజు(డీఎస్పీ), గోరెకర్ విజయ్(ఐపీబీపీ), దేవిదాస్ హోసడే(ఆర్‌పీఐ), బద్దం భోజారెడ్డి(ఏఐఎఫ్‌బీ).

స్వతంత్రులు : ఎలుగుదార్ ప్రవీణ్, జాదవ్ దత్తరాం, జాదవ్ దేవిదాస్, పోతరాజు సుధాకర్, మన్‌మోహన్ జాదవ్, సంజూహోంలే.

ఖానాపూర్‌లో 11మంది..

భుక్యా జాన్సన్‌నాయక్(బీఆర్‌ఎస్), రమేశ్‌రాథోడ్(బీజేపీ), వెడ్మ బొజ్జుపటేల్(కాంగ్రెస్), బన్సీలాల్ రాథోడ్(బీఎస్పీ), ఆశారెడ్డి బొంత(జీజీపీ), కుత్తటి విజయ(పీపీఐ), జాదవ్ ప్రభాస్(డీఎస్పీ), పెందూర్ ప్రియాంక(సీపీఐ.ఎంఎల్, రెడ్‌స్టార్).

స్వతంత్రులు : ఆత్రం రవీందర్, నేతావత్ రాజేందర్, మోహన్.







చిన్నారులతో విధుల్లోకి..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ విధులు నిర్వర్తించేందుకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియానికి బుధవారం కొందరు మహిళా సిబ్బంది తమ చిన్నపిల్లలతో హాజరయ్యారు. ఇతర సిబ్బందికి ఈవీఎంలు పంపిణీ చేసిన ఉన్నతాధికారులు పిల్లలతో వచ్చిన సిబ్బందికి విధులు కేటాయించకుండా రిజర్వులో ఉంచారు. దీంతో తల్లులు తమ పిల్లలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

చివరి ఆయకట్టుకు నీరందేనా?

- నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. దక్కని 'గడ్డెన్న' వాగు ఫలితం
- ప్రాజెక్టు ప్రధాన కాల్వకు కొంత వరకే సీసీ పనులు
- పూర్తిస్థాయిలో అందని సాగునీరు
- ఆందోళనలో రైతాంగం

ప్రాజెక్టు ప్రొఫైల్	
ప్రాజెక్టుపేరు	: గడ్డెన్నవాగు ప్రాజెక్టు
నిర్మాణవ్యయం	: రూ.200 కోట్లు
ఆయకట్టు	: 14 వేల ఎకరాలు
సీసీ లైనింగ్‌కు కేటాయింపు	: రూ.20 కోట్లు
ప్రధాన కాలువ పొడవు	: 42 కిలోమీటర్లు
పూర్తయిన పనులు	: 28 కిలోమీటర్లు



లోకేశ్వరంలోని ప్రాజెక్టు ప్రధాన కాల్వలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

లోకేశ్వరం: గడ్డెన్నవాగు ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. భైంసా పట్టణంలోని సుద్దవాగుపై నిర్మించిన గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి సామర్థ్యానికి మించి నీరు వస్తున్నా ఆయకట్టుకు మాత్రం నీరందడం లేదు. కాల్వ లేక ప్రాజెక్టుకు వచ్చే వరద అంతా గోదావరిలోకే పోతుంది.

14 వేల ఎకరాలకు సాగునీరు లక్ష్యం..

భైంసా, లోకేశ్వరం మండలంలోని 11 గ్రామాల్లో 14 వేల ఎకరాలకు సాగు నీరు అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. భైంసా మండలంలోని వాలేగాం, కుంసర, కామోల్ గ్రామాల్లోని 4 వేల ఎకరాలకు.. లోకేశ్వరం మండలంలోని పుస్పూర్, పాట్‌పల్లి(ఎం), సాథ్‌గాం, హథ్‌గాం, బిలోలి, హవర్గ, లోకేశ్వర, మన్మద్, కిష్టాపూర్, భాగాపూర్, రాజూరా, ఎడ్దూర్ తదితర గ్రామాల్లో పదివేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం భైంసా మండలంలోని నాలుగు వేల ఎకరాలతోపాటు లోకేశ్వరం మండలంలోని బిలోలి వరకు సాగునీరు అందుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

ప్రధాన కాల్వ సీసీ లైనింగ్ కోసం రూ.20కోట్లు..

ప్రాజెక్టు నుంచి లోకేశ్వరం మండలంలోని రాజూర గ్రామం వరకు 42 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ నిర్మించారు. ప్రభుత్వం 2010లో రూ.20 కోట్లు మంజూరు చేయడంతో ఈ కాల్వకు 28 కిలోమీటర్ల మేర (లోకేశ్వరం మండలం బిలోలి వరకు) సీసీ లైనింగ్ చేపట్టారు. మరో 14 కిలోమీటర్ల మేర కాలువకు సీసీ లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. కానీ ఏళ్లు గడుస్తున్నా.. ప్రధాన కాల్వకు సీసీ లైనింగ్ పనులు పూర్తి కాకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. అధికారులు పనులు పూర్తి చేసి

డిస్ట్రిబ్యూటరీలు కనుమరుగు..

ప్రాజెక్టు నుంచి లోకేశ్వరం మండలం రాజూర వరకు 42 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన కాలువపై 40 డిస్ట్రిబ్యూటరీలు(ఉపకాల్వలు) నిర్మించారు. కానీ పర్యవేక్షణ లేక ఆయా గ్రామాల్లో ఈ డిస్ట్రిబ్యూటరీలు ఆనవాళ్లు కోల్పోయాయి.

కొన్ని చోట్ల రైతులే డిస్ట్రిబ్యూటర్లను దున్ని వేసి తమ సాగు భూమిలో కలిపేసుకున్నారు. ప్రధాన కాల్వకు గండ్లు పడటంతోపాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అధ్వానంగా మారింది. గతేడాది యాసంగిలో సీసీ లైనింగ్ పూర్తయిన బిలోలి గ్రామం వరకు మాత్రమే సాగు నీరు అందించారు. ఉపకాల్వలకు సిమెంట్ లైనింగ్ చేయకపోవడంతో వర్షాలకు కొట్టుకుపోయాయి.

ఇదీ ప్రాజెక్టు నేపథ్యం..

లోకేశ్వరం, భైంసా మండలాల్లోని ప్రజలకు సాగు, తాగునీటి కష్టాలను దూరం చేయాలనే లక్ష్యంతో మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి గడ్డెన్న (కాకా) భైంసా పట్టణం సమీపంలో సుద్దవాగుపై ఓ ప్రాజెక్టు నిర్మాణానికి సంకల్పించారు. 1.86 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించగా 2004లో పనులు పూర్తయ్యాయి. వారు చేసిన ప్రజాసేవకు గుర్తుగా అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టుకు గడ్డెన్న పేరును నామకరణం చేశారు.

చెరువులోకి వదలడం లేదు



ప్రాజెక్టు నుంచి లోకేశ్వరం భగీరథ చెరువులోకి నీటిని వదలాలి. దీంతో చెరువు ఆయకట్టు భూముల్లో పంటలు పండుతాయి. భగీరథ చెరువు ముందు నుంచే ప్రధాన కాలువ వెళ్తున్నా చెరువులోకి మాత్రం నీరు వదలడం లేదు.

– దేవన్న, లోకేశ్వరం

ప్రతిపాదనలు పంపాం

ప్రాజెక్టు ప్రధాన కాల్వ సీసీ పనులను కొంత పూర్తి చేశాం. వర్షాల కారణంగా పనులకు అంతరాయం ఏర్పడింది. ఆనవాళ్లు కోల్పోయిన డిస్ట్రిబ్యూటరీలకు సీసీ పనుల కోసం రూ.36 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పనులు పూర్తయిన బిలోలి గ్రామం వరకు యాసంగిలో సాగునీరు అందిస్తాం.

– రామారావు, గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఈఈ

చివరి ఆయకట్టుకు అందించండి



లోకేశ్వరం మండలంలోని ఎడ్దూర్ శివారు వరకు ప్రాజెక్టు నీరు అందుతుందని గతంలో అధికారులు చెప్పారు. కానీ మా గ్రామానికే నీరందడం లేదు. ప్రధాన కాల్వలో పిచ్చిమొక్కలను తొలగించి చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలి.

– నారాయణ, రాజూర

సరిహద్దు చెక్‌పోస్టులో పోలీసుల తనిఖీలు

ఖానాపూర్: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో బుధవారం అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఎస్‌టీ బృందం ఆధ్వర్యంలో రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది స్వామి, తదితరులున్నారు.



చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న ఎస్ఎస్‌టీ బృందం

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా దోభీఘాట్



లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన దోభీఘాట్ నిరుపయోగంగా మారింది. పిచ్చిమొక్కలు తొలగించి.. బోరు ఏర్పాటు చేసి దోభీఘాట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని రజకులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రఘువంశీ, పీఆర్ ఏఈ, ఫోన్: 95506 07360

తీగలు సరిచేయాలి

లక్ష్మణచాంద: మండలకేంద్రం నుంచి న్యూ కంజర్ గ్రామం వెళ్లే రోడ్డు మార్గంలో లక్ష్మారెడ్డి పొలం సమీపంలో విద్యుత్ తీగలు చేతికి అందేలా ప్రమాదరకంగా ఉన్నాయి. పొలం కోసేందుకు హార్వేస్టర్ రావడం లేదని తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.